నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | NALGONDA

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 19 : జిల్లా వ్యాప్తంగా అన్ని కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో వచ్చే శుక్రవారం వరకు విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ స్కూళ్లల్లో పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించాలని, అందరికీ పౌష్టికాహారం అందుతుందా లేదా అనే విషయాన్ని పరీక్షించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రితో పాటు మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 గంటలు ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు డెలివరీలకు వెళ్లకుండా, ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు జరిగే విధంగా అవగాహన కలిగించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, ఐసీడీఎస్ పీడీ సక్కుబాయి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ అధికారి రమేశ్, డీపీఓ మురళి, మెప్మా పీడీ కరుణాకర్ పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు

రైతుకు మద్దతిస్తే ఖబడ్దార్

ఉమ్మడి జిల్లా అంతటా అరెస్టులు, నిర్బంధాలు

రుణమాఫీ పోరుకు పోలీసుల అడ్డంకులు

చలో ప్రజాభవన్ ముట్టడికి వెళ్లకుండా ఆటంకాలు

కాంగ్రెస్ సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం

నల్లగొండ ప్రతినిధి/సూర్యాపేట, సెప్టెంబర్19(నమస్తే తెలంగాణ) : షరతులు లేని రుణమాఫీ అమలు కోసం పార్టీలకు అతీతంగా రైతులు పిలుపునిచ్చిన 'చలో ప్రజాభవన్' కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. సోషల్ మీడియా వేదికగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా రుణమాఫీ అమలు కోసం రైతులంతా తరలిరావాలని ఇచ్చిన పిలుపు వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీంతో పలు పార్టీలు, కులసంఘాలు, రైతులు స్వచ్ఛంద పిలుపునకు మద్దతు ప్రకటించారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఆంక్షలు, కుట్రలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు, రైతుసంఘాల నేతలు చలో ప్రజా భవన్‌కు తరలివెళ్లేందుకు సిద్ధం అవుతుండగా ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. దీంతో బుధవారం సాయ ంత్రం నుంచే కాంగ్రెస్ పార్టీ మినహా మిగతా అన్ని రాజకీయ పార్టీల నేతలతోపాటు రైతు సంఘాల నాయకులకు పోలీసు స్టేషన్ల నుంచి ఫోన్లు మొదలయ్యాయి. చలో ప్రజాభవన్ ముట్టడికి వెళ్లేందుకు అనుమతి లేదని, ఎవరైనా వెళ్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా సరే హైదరాబాద్ తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ఎక్కడికక్కడే ముందస్తు అరెస్టులు చేశారు. ముఖ్య నేతలను గృహనిర్బంధం చేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లో ముఖ్యమైన విపక్ష నేతలను అదుపులోకి తీసుకున్నారు. గురువారం మధ్యాహ్నం తర్వాత వదిలేసారు. మిర్యాలగూడలో రైతుబంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతల ను హౌస్ అరెస్టు చేశారు. సీపీఎం, సీపీఐ రైతు సంఘాల నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. నకిరేకల్, వేములపల్లిలో బీజేపీ నేతలను అరెస్టు చేశారు. దేవరకొండ, చందంపేట, హాలియా, డిండిలో బీఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టు చేశారు. చిట్యాలలో బీఆర్ఎస్, బీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. శాలిగౌరారంలో బీఆర్ఎస్ నేతలను, నిడమనూరు, త్రిపురారంలో బీఆర్ఎస్, సీపీఎం నేతల ముందస్తుగా అరెస్టు చేశారు. నార్కట్‌పల్లిలో బీఆర్ఎస్, బీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా అంతటా విపక్ష నేతలను చలో ప్రజాభవన్ వెళ్లకుండా పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ అడ్డుకున్నారు.



చందంపేటలో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేటలో బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను గృహనిర్బంధం చేసిన పోలీసులు

మాట నిలబెట్టుకోలేని అసమర్థ ప్రభుత్వం

- **బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ బడుగుల లింగయ్యయాదవ్**

ఇచ్చిన మాట నిలుపుకోలేక రైతుల పట్ల నిర్బంధకాండ కొనసాగించడం సిగ్గు చేటు. రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ కొనసాగించలేదు. బీఆర్ఎస్ హయాంలో 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశాం. 42 లక్షల మందికి రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం చివరకు 22 లక్షల మందికి రూ.18వేల కోట్లు మాఫీ చేసింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకలా మంత్రులు మరోలా మాట్లాడుతూ ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఆందోళనలు, ధర్నాలకు దిగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో రైతాంగం అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. ప్రజాభవన్ ముట్టడికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులను అరెస్టు చేయడం సరికాదు. పోలీస్ స్టేషన్లకు తరలించడం, గృహ నిర్బంధాలు చేయడం ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనం.

సూర్యాపేట జిల్లాలో

ప్రజాభవన్‌కు తరలివెళ్లకుండా సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్‌నగర్, నూతనకల్, మద్దిరాల, నడిగూడెం, గరిడేపల్లి, తిరుమలగిరి తదితర మండలాల్లో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట పట్టణంలో బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.

నడిగూడెం పోలీసుస్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

శాలిగౌరారంలో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పక్కన మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్, బీఆర్ఎస్ నాయకులు చెరుకు సుధాకర్ తదితరులు

కోమటిరెడ్డి మాటలు విని బీఆర్ఎస్ ఆఫీసు కూల్చొద్దు

- **పై కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే వరకు గడువు ఇవ్వండి**
- **అప్పటి వరకు ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించండి**
- **కలెక్టర్, ఇతర అధికారులకు మాజీ జడ్పీ చైర్మన్ బండ, మాజీ ఎమ్మెల్యే కంచర్ల విజ్ఞప్తి**
- **ప్రభుత్వ నిబంధనల ప్రకారమే భూ కేటాయింపు జరిగిందని వెల్లడి**

నల్లగొండ, సెప్టెంబర్ 19 : నల్లగొండలోని జిల్లా బీఆర్ఎస్ ఆఫీసు కూల్చాలని మొదటి నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కుట్ర పన్నాడని, ఆయన మాటలు విని అధికారులు కూల్చొద్దని మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో గురువారం నల్లగొండ వీటీ కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం గత ప్రభుత్వం భూ కేటాయింపు చేయగా, అప్పట్లో పార్టీ ఆఫీసులకు అనుమతులు అవసరం లేదని మున్సిపల్ కమిషనర్ అంటేనే అనుమతి తీసుకోలేదని తెలిపారు. హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తున్నామని, తొందరపడి భవనాన్ని కూల్చొద్దని, పై కోర్టు నుంచి స్టే తెచ్చుకునే వరకు అవకాశం ఇవ్వాలని కోరారు. అప్పటి వరకు పార్టీ కార్యాలయాన్ని ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని చెప్పారు. అసలు నల్లగొండలో ఏ పార్టీ కార్యాలయానికీ అనుమతులు లేవని, కానీ బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు విషయంలో పక్షపాతం వహించొద్దని సూచించారు.

బీఆర్ఎస్‌పై కక్షతోనే కోమటిరెడ్డి కుట్ర : మాజీ ఎమ్మెల్యే కంచర్ల

బీఆర్ఎస్ పార్టీపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి ఇక్కడ ఈ పార్టీ లేకుండా చేయాలనే ఆలోచనతో పార్టీ ఆఫీసు కూల్చడానికి ప్రయత్నం చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి విమర్శించారు. ఇంతకు ముందే అనేకసార్లు అధికారులను ఆదేశిస్తూ కూల్చాలని కుట్ర పన్నినట్లు తెలిపారు. ప్రస్తుతం నోటీసులు ఇచ్చినప్పుడు తాము ఫైన్ చెల్లిస్తామని అన్నప్పటికీ మంత్రి ఆదేశాలతో అధికారులు తిరస్కరించినట్లు చెప్పారు. కోర్టు తీర్పును ఆసరాగా చేసుకొని కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలు జడ్జిమెంట్ కాపీ రాకముందే జేసీబీలు, బుల్డోజర్లతో ఆఫీసును కూలగొట్టాలని చూస్తున్నట్లు తెలిపారు. కోర్టు తీర్పుపై మరోసారి అప్పీల్ చేస్తామని, అప్పటి వరకు ఈ ఆఫీసును కూల్చొద్దని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కోమటిరెడ్డి పార్టీ ఆఫీసును కూల్చితే ఆయనను ప్రజలు కూ లగొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు.

జిల్లాలో ఏ పార్టీ కార్యాలయాలకు అనుమతులు లేవు : మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, చిరుమర్తి

జిల్లాలో ఏ పార్టీ కార్యాలయానికి కూడా అనుమతులు లేవని, ఏ పార్టీ కార్యాలయానికి వర్తించని నిబంధనలు బీఆర్ఎస్ పార్టీకే ఎందుకు వర్తిస్తాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూల్చడాలే తప్ప కొత్తగా నిర్మించడాలు లేవని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ సర్కార్ బుల్డోజర్ల సంస్కృతి పాటిస్తున్నదని, రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ అదే ఫాలో అవుతున్నదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కూల్చడాలు, ధ్వంసం చేయడాలు లేవని, ఈ విషయం తెలిసిన ఇతర రాజకీయ పార్టీలు కూడా స్పందించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు చెరుకు సుధాకర్, చీర పంకజ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రం లో ఏ పార్టీకీ వర్తించని నిబంధనలు నల్లగొండలో మాత్రమే బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు వర్తిస్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కావాలనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయంలో అధికారులు అర్థం చేసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, తిప్పర్తి, నల్లగొండ మండల పార్టీల అధ్యక్షులు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, నేతలు సింగం రామ్మోహన్, మారగోని గణేశ్, జమాల్ ఖాద్రి, కందు ల లక్ష్మయ్య, కంచనపల్లి రవీందర్ రావు, బడుపుల శంకర్, ఊట్కూరి సందీప్ రెడ్డి, నారగోని నర్సింహ, మోదుగురాజు వర్ధన్ రెడ్డి, పేర్ల అశోక్ పాల్గొన్నారు.

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆరోగ్య మిత్రలు

ఆరోగ్య మిత్రలను ఆరోగ్య ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించాలి

- **కలెక్టరేట్ ఎదుట ధర్నా**

నీలగిరి, సెప్టెంబర్ 19 : ఆరోగ్య మిత్రలను ప్రైవేట్ ఏజెన్సీల నుంచి మినహాయించి ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించాలని, డీపీఓ(డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్) హోదాను కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్య మిత్రల సమ్మెలో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట ఆరోగ్య మిత్రలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా ప్రైవేట్, ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు జీఓ 60 ప్రకారంగా పనికి తగ్గ వేతనం రూ. 22,750 చెల్లించాలన్నారు. జెట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విధుల్లో చనిపోయిన ఆరోగ్యమిత్రలకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, టీఏ, డీఏలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆరోగ్యమిత్ర జిల్లా అధ్యక్షులు గోలి నాగరాజు, ఆరోగ్యమిత్రలు మల్లయ్య, గోవింద్‌రెడ్డి, నరేశ్, వేణు, రామలింగయ్య, భరత్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

అమాత్యా.. సాగునీళ్లపై సమీక్షేదీ?

- **సాగర్‌లో నీళ్లున్నా.. పంట కాల్వల్లో పారని నీళ్లు**
- **నేటికీ పనిచేయని ఏఎమ్మార్పీ నాలుగో మోటర్**
- **ఏఎమ్మార్పీ, వరదకాల్వ పరిధిలో ఎండుతున్న పొలాలు**
- **డిస్ట్రిబ్యూటరీల కింద నిత్యం రైతుల ఆందోళన**
- **సాగునీటిపై కొరవడిన పర్యవేక్షణ.. నీళ్లు పారేదెట్లా?**
- **ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న జిల్లా రైతాంగం**

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్19(నమస్తే తెలంగాణ) :జిల్లా జలభాండాగారం నాగార్జునసాగర్‌ను ముంచెత్తి కృష్ణానది సముద్రంలో కలుస్తా.. నేటికీ నల్లగొండ జిల్లా పరిధిలోని ఆయకట్టు భూములకు సాగునీరు అందని దుస్థితి వెక్కిరిస్తుంది. సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులోని చివరి భూములతో పాటు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ, వరద కాల్వ పరిధిలో నేటికీ వేలాది ఎకరాలకు సాగునీరు పారడం లేదు. సాగర్ పొంగిపొర్లుతున్నా.. ఆ నీటిని భూములకు పారించాన్న చిత్తశుద్ధి ప్రభుత్వంలో కొరవడిందనడానికి నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతున్న రైతుల ఆందోళనలే నిదర్శనంగా మారాయి. ఏఎమ్మార్పీతో పాటు వరద కాల్వ పరిధిలోని పలు డిస్ట్రిబ్యూటరీల కింద సుమారు 50వేల ఎకరాలకు ఇప్పటికీ సాగునీరు అందడం లేదు. ఇంత జరుగుతున్నా సాగునీటి సరఫరాపై ఈ సీజన్లో ఒక్కసారి కూడా జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు సమీక్ష చేసిన పరిస్థితి లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. ప్రస్తుతం పుష్కలంగా అందుబాటులో ఉన్న సాగునీటిని ఎలా బీడు భూముల్లో పారించాలో దృష్టి పెట్టని మంత్రులు పెండింగ్ ప్రాజెక్టుల పరిశీలన, రివ్యూ పేరుతో శుక్రవారం జిల్లాకు వస్తుండడం చర్చనీయాంశంగా మారింది. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకుంటూనే ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న సాగునీటి సమర్థ వినియోగంపైనా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

నిత్యం రైతుల ఆందోళనలు

ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పరిధిలోని పలు డిస్ట్రిబ్యూటరీలతోపాటు వరద కాల్వ పరిధిలోని రైతులు నిత్యం సాగునీటి కోసం రోడ్డెక్కుతున్నారు. ఆగస్టు 2న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సాగర్ ఎడమ కాల్వతోపాటు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ, వరద కాల్వకు సైతం సాగునీటిని విడుదల చేశారు. కానీ ఆ నీరు నేటికీ 45 రోజులు దాటినా సంపూర్ణ ఆయకట్టుకు సాగునీరు పారడం లేదు. గతేడాది వర్షాలు లేక ఉమ్మడి జిల్లా పరిధిలోని యాసంగి సీజన్‌కు సాగునీరు ఇవ్వలేదు. కానీ ఈ సారి ముందే వర్షాలు కురిసి సాగర్ నిండి దాదాపు నెల రోజులుగా వందలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తున్నా జిల్లా పరిధిలోని ఆయకట్టుకు మాత్రం సాగునీరు అందడం లేదు. దీంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా ఏఎమ్మార్పీ పరిధిలో కీలకమైన డి-37, డి-39, డి-40 పరిధిలో నేటికీ చెరువులు, కుంటలు నిండిన దాఖలాలు లేవు. ఈ కాల్వలు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో సగం ప్రాంతాల వరకే నీరు పారుతున్నది. దిగువన ఉన్న ప్రాంతాలన్నీ సాగునీటికి నోచుకోలేదు. తిప్పర్తి, మాడ్గుల పల్లి మండలాల్లోని రైతులు నిత్యం సాగునీళ్ల కోసం రోడ్డెక్కుతున్నారు. పానగల్ ఉదయ సముద్రం వద్ద, నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై, డిస్ట్రిబ్యూటరీ కాల్వలపై ఎక్కడికక్కడే ఆందోళనలు చేస్తున్నారు.

నాలుగో మోటర్ ఎప్పుడో...?

గతేడాది అక్టోబర్‌లో మరమ్మతుకు గురైన ఏఎమ్మార్పీ యూనిట్ 2లోని మోటర్ నేటికీ అందుబాటులోకి రాలేదు. వేసవిలోనే మోటర్లను చెక్ చేసి సీజన్ ప్రారంభానికి సిద్ధం చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం పర్యవేక్షణ లేకపోవడంతో దాదాపు ఏడాది కాలం పట్టింది. ఆగస్టు 2 నుంచే సాగర్ నుంచి నాలుగు మోటర్ల ద్వారా నీటిని తోడుకునే అవకాశం ఉన్నా.. మూడు మోటర్లనే రన్ చేస్తున్నారు. దీంతో 600 క్యూసెక్కుల నీరు హైదరాబాద్ తాగునీటికి మరో 1,200 క్యూసెక్కుల నీరు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ తోపాటు డిస్ట్రిబ్యూటరీలకు విడుదల చేస్తున్నారు. దీనివల్ల అటు అక్కంపల్లి రిజర్వాయర్‌లో ఇటు పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగడం లేదు. ఫలితంగా ఈ రెండింటి నుంచి డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేయడం ఆలస్యమైంది. దీంతో ఇప్పటికీ ఏఎమ్మార్పీ పరిధిలోని ప్రధాన డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీరు పారడం లేదు. ఆగస్టు మొదటి వారంలో రైతులు ఆందోళనకు దిగితే అదే నెల 31వరకు నాలుగో మోటర్ అందుబాటులోకి తెస్తామని అధికారులు ప్రకటించారు. కానీ మరమ్మతులు పూర్తి కాకపోవడం గమనార్హం. మూడు నాలుగు రోజుల్లో నడిపిస్తామని సీఈ అజయ్‌కుమార్ ప్రకటించినా ఈ నెలాఖరు కావచ్చని తెలుస్తున్నది.

వరదకాల్వ పరిధిలో...

ఇక ఇదే సమయంలో ఎల్ఎల్‌బీసీ వరద కాల్వ పరిధిలో 80వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా 50వేల ఎకరాలకు మించి ప్రస్తుతం నీరు చేరడం లేదు. వరద కాల్వ పరిధిలోని మాడ్గులపల్లి మండలంలోని చివరి భూములకు నీరు రావడం లేదు. ఎగువన ఉన్న రైతులు ఇష్టారాజ్యంగా కాల్వకే భారీ మోటర్లు వేసి కిలోమీటర్ల మేర పైప్‌లైన్లతో సాగునీటిని తరలించడంతో పాటు అక్రమంగా తూములు పెట్టి నీటిని తీసుకెళ్తున్నట్లు దిగున రైతులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రులు జోక్యం చేసుకుని కాల్వపై అధికారుల పర్యవేక్షణను పట్టిష్ట పరిస్తే దిగువన ఉన్న భూములకు కూడా సాగునీరు అందుతుందని సూచిస్తున్నారు. కానీ ఇలాంటి పరిస్థితి లేక పోవడంతో రైతులు రాత్రిళ్లు కాల్వలపైనే నిద్రిస్తూ పహారా కాస్తున్న సందర్భాలు నెలకొన్నాయి. సాగర్ నిండా నీళ్లున్నా కీలకమైన సీజన్‌లో రెండు నెలలపాటు సాగునీళ్లు ఇవ్వకపోతే పంటలు ఎలా పండిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

నీళ్లు లేక ఖాళీగా కనబడుతున్న డీ40కాల్వ

మత్స్యశాఖలో టెండర్ల రచ్చ

బీఆర్ఎస్ వారిని రానివ్వకుండా కాంగ్రెస్ వాళ్లే వేసిన టెండర్లు

- **వారిలోనూ రెండు వర్గాలుగా వీడి గొడవలు**
- **ఫిష్ సీడ్ ఫామ్ లేకున్నా టెండరు వేసిన ఆ నలుగురు**

నల్లగొండ, సెప్టెంబర్ 19 : చెరువుల్లో వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలు పోసేందుకు నిర్వహించిన టెండర్ల కారణంగా మత్స్య శాఖలో రచ్చ అయింది. గడిచిన వారం రోజులుగా కొనసాగుతున్న ఈ గొడవ గురువారం టెండర్ల సందర్భంగా రెండు వర్గాలుగా వీడి రసాభాస చేసుకున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన కాంట్రాక్టర్లను పలు కారణాలతో అనర్హులుగా ప్రకటించి నిర్వహించిన టెండర్లల్లో కాంగ్రెస్ వారే రెండు వర్గాలుగా వీడిపోయారు. గల్లాలు పట్టుకొని అంగీలు చింపుకున్న పరిస్థితి దాక తెచ్చుకున్నట్లు మత్స్యశాఖ కమిటీలో పలువురు సభ్యులు చర్చించుకుంటున్నారు. ఎట్టకేలకు గొడవల అనంతరం నలుగురు కాంట్రాక్టర్లు ఈ టెండర్లు వేయగా అందులో ఏ ఒక్కరికీ ఫిష్ ఫామ్ లేకపోవం గమనార్హం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది నుంచి వంద శాతం సబ్సిడీతో జిల్లాలో ఆరు కోట్ల చేప పిల్లలను గ్రామీణ చెరువుల నుంచి రిజర్వాయర్ల దాక పోసింది. ఈ సారి దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతానికి కుదించగా ఆ చేప పిల్లలు పోయడానికి కూడా కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లనే అర్హులుగా తీసుకోవడం పలు విమర్శలకు తావిస్తున్నది.

బీఆర్ఎస్ వాళ్లు లేకుండా చేసి..

మత్స్య కార్మికుల జీవన విధానం మెరుగు పడాలనే ఆలోచనతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లాలో ప్రతి ఏడాది ఆరు కోట్ల చేప పిల్లలను రూ.5.50కోట్లు వెచ్చించి వంద శాతం సబ్సిడీతో అందజేసింది. టెండర్లల్లో తెలంగాణతో పాటు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారు సైతం పాల్గొనగా ఎవరు తక్కువ కోట్ చేస్తే వారికే ఇచ్చింది. ఈ సారి ఇప్పడికే రెండు సార్లు రెండు లక్షల చొప్పున డీడీలు చెల్లించి అన్ని పార్టీలకు చెందిన కాంట్రాక్టర్లు టెండర్లు వేయగా రెండు సార్లు ఫామ్ లేదని సాకు చూపించి రద్దు చేశారు. ఈ సారి బీఆర్ఎస్ వారు లేకుండా జాగ్రత్తలు తీసుకోగా కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కాంట్రాక్టర్లు మాత్రమే గురువారం టెండర్లు వేయడం ఎట్టకేలకు టెండర్ల ప్రక్రియ ముగిసినట్టయ్యింది.

ఆంధ్రా నుంచి తెచ్చేందుకు కాంట్రాక్టర్ల ప్లాన్..

జిల్లాలో ఇప్పటికే అన్ని చెరువుల్లోకి నీళ్లు వస్తున్నప్పటికీ ఇప్పటి దాక ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే చేప పిల్లల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేయలేదు. ఈ సారి మూడు కోట్ల చేప పిల్లలు మాత్రమే పోసేందుకు టెండర్లు పిలిచారు. టెండరు వేసిన కాంట్రాక్టర్లు ఈ సారి ఆంధ్రాలోని కైకలూరు నుంచి చేప పిల్లలు తెచ్చేందుకు ప్లాన్ వేస్తున్నట్లు తెలుస్తుంది.

మృత్య శాఖ కార్యాలయంలోనే..

బీఆర్ఎస్ కాంట్రాక్టర్లు సైడ్ అయ్యాక కాంగ్రెస్ పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు మాత్రమే టెండర్లు వేసేందుకు లైన్‌లోకి వచ్చారు. ఇందులో ప్రతియేటా టెండరు వేస్తున్న కాంట్రాక్టర్(గత మున్సిపల్ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి)తో పాటు మరో ముగ్గురు టెండరు వేశారు. ఈయనతో మింగుడు పడని ఆ ముగ్గురు వ్యతిరేకిస్తూ గొడవకు దిగినట్టు సమాచారం. ఈ గొడవ చిలికి చిలికి గాలి వానలా మారి కలెక్టరేట్‌లోని మత్స్య శాఖ కార్యాలయంలో గల్లాలు పట్టుకొని అంగీలు చింపుకునే వరకు వచ్చింది. ప్రధానంగా మత్స్యశాఖ నూతనంగా వేసిన కమిటీలో క్రియాశీలకంగా ఉన్న గుర్రంపోడ్ పాలక వర్గ సభ్యుడు ఓడిపోయిన కౌన్సిలర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా ఈ నలుగురిలో ఏ ఒక్కరికీ ఫిష్ సీడ్ ఫామ్ లేదని పలువురు పాలక వర్గ సభ్యులు అంటున్నారు. వెరిఫికేషన్‌లో వీరినే ఉంచుతారా లేదా అనేది అధికారులు తేల్చాల్సి ఉంది.

చెక్ చేసిన తర్వాతే ఫైనల్ చేస్తాం

ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో ఇచ్చే చేప పిల్లల సరఫరాకు నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. టెండర్ల ఆధారంగా ప్రీ బిట్స్ ఓపెన్ చేశాము. వారికి ఫిష్ సీడ్ ఫామ్స్ ఉన్నాయా లేదా అని చెక్ చేసిన తర్వాత